క్లుప్తంగా

చిన్నంబావి ఎస్‌ఐగా జగన్మోహన్



చిన్నంబావి: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా జగన్మోహన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. అసాంఘిక కార్యక్రమాలు చేసేవారిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. పోలీస్ సిబ్బంది నూతన ఎస్‌ఐకి శుభాకాంక్షలు తెలిపారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

చిన్నంబావి: మండలంలోని పెద్దదగడ గ్రామ శివారులోని ప్రధాన మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వేళ్తే మండలంలోని కొప్పునూరుకు చెందిన ఎల్లస్వామి, సందీప్ బైక్‌పై పెద్దదగడ నుంచి స్వగ్రామానికి వస్తున్న క్రమంలో మలుపు వద్ద అదుపు తప్పి బైక్ కింద పడింది. దీంతో ఇద్దరికి తీవ్ర గాయలయ్యాయి. బాధితులను స్థానికులు కొల్లాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

యూటీఎఫ్ కార్యవర్గం ఎంపిక



వీపనగండ్ల: మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవిప్రసాద్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి డి కృష్ణయ్య ఆధ్వర్యంలో మండల కార్యవర్గాన్ని ఉపాధ్యాయులు బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ గౌరవాధ్యక్షుడిగా బతుకన్న, అధ్యక్షుడిగా రాంచంద్రయ్య, ఉపాధ్యక్షులుగా రామకృష్ణ, రోహిణి, ప్రధాన కార్యదర్శిగా బి స్వామి, కోశాధికారిగా దేవేందర్, కార్యదర్శులుగా శ్రీనివాసులు, రంజిత్, శ్రీలత, రాములు, గోవిందు నాయక్, వనిత, రవి, సుష్మిత ఎంపికయ్యారు.

వ్యక్తి అదృశ్యం



ఆత్మకూర్: వ్యక్తి కనిపించడం లేదని బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. మండలంలోని మూలమళ్ల గ్రామానికి చెందిన పెంటగుంత రంగన్న ఈ నెల 7వ తేదీన ఆత్మకూర్‌లోని దవాఖానాకు వెళ్తున్నానని ఆటోలో వెళ్లాడు. రాత్రి అయినా రాకపోవడంతో భార్య బుచ్చమ్మ, కుమారుడు రాజు బంధువుల వద్ద, ఆత్మకూర్‌లో ఆచూకీ కోసం వెతికినా లాభం లేకపోవడంతో బుధవారం ఫిర్యాదు చేశారన్నారు. రంగన్న కాలు ఫ్యాక్చర్ కావడంతో స్టాండు సహాయంతో నడుస్తున్నాడని, ఆచూకీ తెలిసిన వారు 87126 70631 నంబరుకు సమాచారం ఎస్‌ఐ ఇవ్వాలని కోరారు.

'అరుణోదయ' కరపత్రాలు విడుదల



వనపర్తి టౌన్: అరుణోదయ 50 వసంతాల కరపత్రాలను ఎస్‌ఎన్ శంకరన్ పార్కులో బుధవారం ఆ సంఘ నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి జనజ్వాల మాట్లాడుతూ జంపాల చంద్రశేఖర్‌ప్రసాద్ ఆధ్వర్యంలో 1974లో ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల వేదికగా అరుణోదయ పురుడు పోసుకుందన్నారు. అప్పటి నుంచి నేటి వరకు విప్లవ ఉద్యమంలో ఆట, పాట, మాటల ద్వారా ప్రజల్లోకి వెళ్తూ ప్రజా సమస్యల పరిష్కారాని కోసం నిరంతరం పోరాడుతున్నామని తెలిపారు. 2024 నాటికి 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కవి, గాయని విమల ఆధ్వర్యంలో వేడుకలను సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరపనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో డీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు యేసుపు, బహుజన ఉద్యోగ సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

17న మందకృష్ణ రాక



వనపర్తి టౌన్: పాలమూరు యూనివర్సిటీకి ఈనెల 17న మందకృష్ణ మాదిగ రానున్నట్లు ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.పరశురాముడు తెలిపారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను బుధవారం స్థానిక విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ అనుబంధం సంఘం, ఉప కులాల విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. పాలమూరు యూనివర్సిటీలో జరిగే మాదిగ విద్యార్థుల మహాసభను జయప్రదం చేయాలని కోరారు. ఎస్సీ వర్గీకరణ అమలుకోసం కాంగ్రెస్ ప్రభుత్వంపై మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శివ మాదిగ, అన్వేష్ మాదిగ, చంటి మాదిగ, సురేష్ మాదిగ తదితరులు ఉన్నారు.

అసంపూర్తి నిర్మాణంతో అవస్థలు

- రేమద్దుల ఉన్నత పాఠశాలలో నిలిచిన అదనపు గదుల పనులు
- నాసిరకం అంటూ ఫిర్యాదు
- రెండేళ్లు దాటిన ముందుకు సాగని పనులు



పిల్లర్ల దశలో నిలిచిన నిర్మాణం



రేమద్దుల నుంచి కలెక్టరేట్‌కు పాదయాత్ర చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

పాన్‌గల్: మండలంలోని రేమద్దుల ఉన్నత పాఠశాలలో గదుల కొరత తీర్చేందుకు అప్పటి ప్రభుత్వం 2022 సంవత్సరంలో మన ఊరు–మన బడి పథకం ద్వారా అదనపు గదుల నిర్మాణం కోసం రూ.64 లక్షలు మంజూరు చేసింది. అదనపు గదుల నిర్మాణం స్లాబ్ వరకు వచ్చినా.. పనులు నాసిరకంగా చేపడుతున్నారని గ్రామస్తులు, విద్యార్థులు కలిసి కలెక్టర్, ఇంజనీరింగ్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో పనులు నిలిచిపోయాయి.

ఆరు తరగతులకు 3 గదులు

గ్రామంలోని ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు మొత్తం 159 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఆరు తరగతులకు ప్రస్తుతం భవనంలో మూడు గదులే ఉండడంతో బోధన ఇబ్బందిగా సాగుతోంది. కొన్ని తరగతులను ఆరు బయట, మరికొన్నింటిని ఒకే గదిలో కూర్చోబెట్టి బోధన చేయాల్సి వస్తుందని ఉపాధ్యాయులు వాపోయారు. పాఠశాల అదనపు గదుల నిర్మాణం నాణ్యతగా లేవనే ఫిర్యాదుతో నిలిచిన పనులు ఎక్కడి నుంచి ప్రారంభిస్తారని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. నాసికరం పనులపై కాంట్రాక్టర్, అధికారులు ఎవరు బాధ్యత తీసుకుంటారనే విషయంపై స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. విషయాన్ని స్థానిక నాయకులు మంత్రి జూపల్లి దృష్టికి తీసుకెళ్లారు.

కలెక్టరేట్ వరకు పాదయాత్ర

అదనపు గదుల నిర్మాణం వెంటనే చేపట్టి ఇబ్బందులు తొలగించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, వివిధ ప్రజా సంఘాలు, విద్యార్థులతో కలిసి ఈనెల 3వ తేదీన గ్రామం నుంచి కలెక్టరేట్ వరకు 20 కిలోమీటర్ల పాదయాత్ర చేసి సమస్యను కలెక్టర్, ఇంజనీరింగ్, విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయా సమస్యపై సమగ్ర విచారణ జరిపి తగు న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు

ఉన్నతాధికారులకు నివేదించాం



అదనపు గదుల నిర్మాణం చేపట్టాలని రేమద్దుల నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు పాదయాత్ర చేపట్టడంతో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు నిర్మాణం పనులను పరిశీలించాం. ప్రస్తుతం ఉన్న గదులు విద్యార్థులకు సరిపోక ఇబ్బందిగా ఉన్న మాట వాస్తవమే. అదనపు గదుల నిర్మాణం పూర్తయితేనే ఇబ్బందులు తొలుగుతాయనే విషయాన్ని జిల్లా అధికారులకు నివేదించాం.

– శ్రీనివాసులు, ఎంఈఓ, పాన్‌గల్

బోధనకు ఇబ్బంది



మా పాఠశాలలో గదుల కొరతతో 10వ తరగతి విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్ మీడియం ఒకే దగ్గర బోధిస్తున్నారు. ఒక మీడియం వారికి బోధిస్తే మరొక మీడియం వారు ఖాళీగా ఉండాలి. దీంతో ఇబ్బందులు తప్పడంలేదు. సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకే మా గ్రామం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించాం.

– మల్లీశ్వరీ, 10వ తరగతి, రేమద్దుల

కలెక్టర్ ఆదేశాల మేరకు..

రేమద్దుల ఉన్నత పాఠశాలలో అసంపూర్తి అదనపు గదుల నిర్మాణం అదనపు గదుల నిర్మాణం నిలిచిన పనులపై పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందజేశాం. ఈ విషయంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మరో సారి పనులు పరిశీలించి ముందుకు సాగుతాం.

– మల్లయ్య పీఆర్ ఈఈ, వనపర్తి

రాయిణిపేట వాసికి పురస్కారం



డాక్టరేట్ అందుకుంటున్న ఎల్‌వీ రమేష్‌నాయక్



పురస్కారం అందుకుంటున్న వేణుగోపాలరావు

కొత్తకోట రూరల్: తిరుమల తిరుపతి మహతి ఆడిటోరియంలో జరిగిన ఎస్ఎస్ లైవ్ ఆస్ట్రో వారు నిర్వహించిన జ్యోతిష్య మహాసభ సెమినార్‌లో భాగంగా మండలంలోని రాయిణిపేట గ్రామానికి చెందిన పురోహితుడు వేణుగోపాలరావు పాల్గొని అత్యుత్తమ ప్రదర్శన చేయడంతో ఆయనకు జోతిష్య ఆచార్య పురస్కారం లభించింది. వారు రాసిన జ్యోతిష్య ఆర్టికల్స్ జాతీయ స్థాయిలోని ఎంఏ–జైన్ పత్రికలో ప్రచురితమయ్యాయి. ఈ సందర్భంగా వేణుగోపాలరావు గురువులు ధాతాపురం శేషాచార్యులు వీఎస్ఎస్ మూర్తి, శివరంజన్ కృతజ్ఞతలు తెలిపారు. ఇటువంటి ఘన సత్కారం, పురస్కారం రావడం సంతోషంగా ఉందని తాజా మాజీ సర్పంచ్ ఆకుల శ్రీనివాస్‌తో పాటు గ్రామస్తులు సంపత్‌రెడ్డి, పాండురంగయ్య, భాస్కర్‌రెడ్డి తదితరులు ఆనందం వ్యక్తం చేశారు.

అమరచింత వాసికి డాక్టరేట్

అమరచింత: తిరుమల తిరుపతి మహతి ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో అమరచింత మున్సిపాలిటీలోని కొత్తతండాకు చెందిన రమేష్‌నాయక్ న్యూమరాలజీలో డాక్టరేట్ అందుకున్నారు. రమేష్‌నాయక్ ప్రాథమిక విద్య 1 నుంచి 5 వరకు సరస్వతి శిశుమందిరం, 6 నుంచి 10 వరకు జెడ్పీ ఉన్నత పాఠశాల అమరచింతలో విద్యనభ్యసించారు. ఇంటర్ ఒంగోలు, డిగ్రీ నల్గొండలో, ఎంఫార్మసీ జేఎన్‌టీయూ, హైదరాబాద్‌లో పూర్తిచేశారు. డిల్లీలోని అరవింద్‌సుద్ ఇనిస్టిట్యూషన్ ఆఫ్ న్యూమరాలజీ, ఇండియన్ స్కూల్ ఆఫ్ యోగా చెన్నైలో, యోగ థెరఫీ కోర్సును బెంగళూరు యూనివర్శిటీలో పూర్తి చేసిన ఎల్‌వీ రమేష్‌నాయక్‌కు గౌవర డాక్టరేట్ దక్కడం హర్షనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ అన్నారు.

నేడు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

పాన్‌గల్: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీ నాయకులతో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గోవింద్‌రావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా డ్రాఫ్ట్ పోలింగ్ కేంద్రాల నిర్ధారణపై చ ర్చించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు. అన్ని పార్టీల రాజకీయ నేతలు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు.

ఆశా కార్యకర్తలపై దాడి అమానుషం

పాన్‌గల్: ఆశా వర్కర్ల డిమాండ్ల సాధన కోసం హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో వారిపై పోలీసులు అనుచితంగా ప్రవర్తించి దాడి చేయడం అమానుషమని సీపీఎం మండల కార్యదర్శి బాల్యనాయక్, రాము బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. పోలీసుల తోపులాటలో గాయపడిన ఆశా కార్యకర్త రహీంబీని ప్రభుత్వ పరంగా ఆదుకోవడంతో పాటు ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

'మాజీ ఎమ్మెల్యే ఆల చేసింది ఏమిలేదు'



కొత్తకోట: మండల అభివృద్ధి కోసం మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి చేసింది ఏంలేదని మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా అధికారంలో ఉండి కొత్తకోటకు ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదన్నారు. కొత్తకోట పట్టణంలో నెలకు రూ.యాభై వేలు వచ్చే ప్రభుత్వ భవనాన్ని ఎందుకు ఆకస్మికంగా ఖాళీ చేసి కూల్చేశారో ప్రజలకు తెలుసన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన జి.మధుసూదన్‌రెడ్డి ఏడాదిలోనే పట్టణ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేక అసత్యాలు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో నగరపు బీచుపల్లి, పోతులపల్లి శ్రీనివాస్, వేముల శ్రీనివాస్‌రెడ్డి, చర్లపల్లి శేఖర్‌రెడ్డి, ఎంజే బోయేజ్, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళపై దాడి: ఇద్దరిపై కేసు నమోదు

ఖిల్లాఘనపురం: భూమి విషయంలో ఓ మహిళపై దాడి చేసిన విషయంలో ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశామని ఎస్ సురేష్‌గౌడ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం ఖిల్లాఘనపురం మండలం సల్కెలాపురం గ్రామానికి చెందిన బత్తుల అనిత భర్తకు ఇద్దరు అన్నదమ్ములు. వీరికి గతంలో ఇంటి జాగా విషయంలో గొడవలు ఉన్నాయి. కాగా మంగళవారం అనిత మరిది విష్ణు, బావ స్వామి ఇద్దరు అనిత ఇంటికి వచ్చి వ్యవసాయ పొలంలో బోరు వేస్తున్నామని, పొత్తు కలవాలని కోరగా.. తనతో డబ్బులు లేవని మీరే వేసుకోండని ఆమె చెప్పింది. దీంతో వారు ఇద్దరు పొలంలో బోరు వేసుకున్నారు. బోరు వేసిన పొలం మీరు తీసుకుని, వేరే పొలం తమకు ఇవ్వాలని అనిత వారిని కోరింది. ఈ విషయంలో గొడవ జరగడంతో అనితను విష్ణు, స్వామి పరుశపదజాలంలో తిట్టడంతో పాటుగా చంపుతామని బెదిరించి కర్రతో కొట్టారు. ఈ విషయమై బుధవారం బాధితురాలి పిర్యాధు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అపరిచిత వ్యక్తులతో జాగ్రత్త

పెద్దకొత్తపల్లి: అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని షీటీం ఇన్‌చార్జ్ విజయలక్ష్మి కోరారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో సోషల్ మీడియాపై బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో కొత్తవారితో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం, వాట్సాప్ ద్వారా అపరిచిత వ్యక్తులు మోసాలకు పాల్పడుతున్నారని వివరించారు. మొబైల్‌లు వాడకం వలన వచ్చే లాభనష్టాలు తెలిపారు. మహిళలు, బాలికలు వేధింపులకు గురైతే షీటీంను సంప్రదించాలని కోరారు. ఏదైన సమస్య ఎదురైతే 100 నంబర్‌కు ఫోన్ చేసి తెలపాలన్నారు. భరోసా కేంద్రం కోఆర్డినేటర్ శ్రీలత ఫోక్సో చట్టంపై, భరోసా కేంద్రం సేవలపై అవగాహన కల్పించారు.

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



ఖిల్లాఘనపురం నుంచి జిల్లాస్థాయికి ఎంపికైన క్రీడాకారులతో ఎంఈఓ, పీఈటీలు

సాక్షి, నెట్‌వర్క్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని అధికారులు ఆకాంక్షించారు. మండల స్థాయి సీఎం కప్ పోటీలను బుధవారం కొనసాగించారు. అధికారులు మాట్లాడుతూ విద్యార్థులు సోదరభావంతో మెలిగి ఆటలు ఆడాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యం గల క్రీడాకారులను గుర్తించేందుకు సీఎం కప్ పోటీలు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో పురచైర్‌పర్సన్ గాయత్రి, తహసీల్దార్ సరస్వతి, పీఏసీఎస్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, వనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, ఎంపీడీఓలు శ్రీరాంరెడ్డి, గోవింద్‌రావు, ఎంఈఓలు భాస్కర్‌సింగ్, బాలరాజు, శ్రీనివాసులు, జయశంకర్, కమిషనర్ శశిధర్, ఫిజికల్ డైరెక్టర్లు సంతోష, వెంకట్, మహేష్, ప్రేమ్‌కుమార్, మన్యం, కోచ్‌లు అబ్దుల్‌ఖాదర్, ఎంపీఓలు నరసింహులు, రఘురాములు, పుష్ప, మాజీ ఎంపీపీ రఘు ప్రసాద్, మాజీ జెడ్పీటీసీ వెంకటస్వామి, హెచ్‌ఎం శాంతన్న పాల్గొన్నారు.



పెద్దమందడిలో..



పాన్‌గల్‌లో కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు



అమరచింతలో..

'అర్హులందరికీ ఇళ్ల స్థలాలు చూపాలి'



మాట్లాడుతున్న బాల్యానాయక్

అమరచింత: దుంపాయికుంటలో రెండేళ్లుగా గుడిసెలు నిర్మించుకుని పోరాటం చేస్తున్నా.. వారిని ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బాల్యానాయక్, మండల కార్యదర్శి జీఎస్ గోపి అన్నారు. పట్టణంలోని దుంపాయికుంటలో గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్న వారిని బుధవారం సీపీఎం నాయకులు కలిసి వారి పోరాటానికి మద్దతు తెలిపారు. ఈసందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ 24 ఏళ్ల క్రితం ఇంటి పట్టాలు ఇచ్చినా.. ఇప్పటి వరకు స్థలాలు చూపట్లేదని వాపోయారు. గత ప్రభుత్వం ఇంటి స్థలాలు చూపుతామంటూ కాలయాపన చేసిందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటేష్, అజయ్, శ్యాంసుందర్, ఆర్ఎస్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడి హేయమైన చర్య



ఆత్మకూర్‌లో నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

ఆత్మకూర్: జర్నలిస్టులపై దాడి చేసి, దుర్భాషలాడిన నటుడు మోహన్‌బాబుని వెంటనే అరెస్టు చేయాలని జర్నలిస్టులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఎంపీడీఓ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు జర్నలిస్టులు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. జర్నలిస్టులపై దాడులను అరికట్టాలని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ చాంద్‌పాషాకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్, కౌన్సిలర్ మండ్ల రామకృష్ణ, బీజేపీ నాయకుడు భీంరెడ్డి, కోఆప్షన్‌సభ్యుడు రియాజ్‌అలీ, అర్జున్‌కుమార్, అమరచింత, ఆత్మకూర్‌కు చెందిన ప్రింట్, ఎలాక్ట్రానిక్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

దాడిని ఖండించండి

వీపనగండ్ల: ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధులు, అధికారులకు వారధులుగా వ్యవహరిస్తున్న విలేకరులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, స్థానిక ప్రెస్‌క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కృష్ణయ్య, రవిందర్‌దాస్, నాయకులు నటరాజ్, శేఖర్, రాము తదితరులు కోరారు.

మహాసభలను జయప్రదం చేయాలి



రామకృష్ణకు కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానిస్తున్న నాయకులు

వనపర్తి రూరల్: డిసెంబర్ 22న నిర్వహించే టీజీఎస్పీడీసీఎల్ కంపెనీ మహాసభలను జయప్రదం చేయాలని తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ గోవర్ధన్, సత్యం కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. భవిష్యత్‌లో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ మహాసభలో తీర్మానాలు రూపొదిస్తామని తెలిపారు. తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్‌లో లైన్‌మెన్ రామకృష్ణకు కడువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమానికి ఎండీ మస్తాన్, బాలరాజు, ఆనంద్‌గౌడ్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొనండి



పూజల్లో పాల్గొన్న రజనిసాయిచంద్

ఆత్మకూర్: హరిహరపుత్ర అయ్యప్పస్వామి నూతన ఆలయ ప్రారంభోత్సవం, స్వామివారి విగ్రహప్రతిష్ఠాపన మహోత్సవానికి భక్తులు వేలాదిగా హాజరు కావాలని నిర్వాహకులు డాక్టర్ శ్రీధర్‌గౌడ్, గాడి లక్ష్మీనారాయణ తెలిపారు. బుధవారం స్థానిక అయ్యప్ప ఆలయంలో రాష్ట్ర గిడ్డంగుల శాఖ మాజీ చైర్‌పర్సన్ రజనీసాయిచంద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడు రోజుల పాటు ప్రముఖ వేదపండితుడు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాపన, ప్రత్యేక పూజలు జరుగుతాయని, మధ్యాహ్నం అన్నదానం, రాత్రి అల్పాహారం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో గురుస్వాములు అనిల్, గోవర్ధన్, గాడి లక్ష్మణ్, ఎస్టీడీ శ్రీను, మెకానిక్ శ్రీను, జిన్నారం శ్రీను, కూరగాయల రఘు, దివాకర్, భరత్, తోటరవి, బాలు, రఘు, ఎల్లయ్య, వెంకట్రాములు, నాగరాజు, మాలధారులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో గీతా పారాయణం



ఖిల్లాఘనపురం అంజనేయస్వామి ఆలయంలో గీతా పారాయణం చేస్తున్న మాలధారులు



చిన్నంబావిలో విద్యార్థుల నృత్య ప్రదర్శన

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బెస్తగేరి అంజనేయస్వామి ఆలయంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గీతా పారాయణం నిర్వహించారు. గీతా జయంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పరిషత్ ప్రముఖులు అంజనేయులు, భాస్కర్, శ్రీరాములు తెలిపారు. భగవద్గీతలోని శ్లోకాలను పాఠ్య పుస్తకాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. సమాజంలో ఎలా జీవించాలో భగవద్గీత ప్రపంచ మానవాళికి వివరిస్తుందన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

చిన్నంబావి: మండలకేంద్రంలోని ప్రధాన చౌరస్తా వద్ద రిటైర్డ్ ఉపాధ్యాయుడు మోహన్ ఆధ్వర్యంలో గీతా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గీతా పారాయణం, కృష్ణార్జునల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విద్యార్థులతో భరతనాట్యం, కూచిపూడి నృత్యం, మహిళల భగవద్గీత పారాయణం మేళతాళాల మధ్య ఘనంగా నిర్వహించారు. అనంతరం భగవద్గీత సహస్ర దళార్చన చేశారు. ఈ వేడుకల్లో తబలా ప్రవీణ్ ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌యాదవ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, బీఎస్పీ నాయకులు కురుమయ్య, జగదీశ్ పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకలను వరుసగా ఐదో ఏట నిర్వహిస్తున్న మోహన్‌ను స్థానికులు శాలువాతో సన్మానించారు.

దళిత హక్కుల రక్షణకు పోరాటం



డీహెచ్‌పీఎస్ నూతన కమిటీ సభ్యులతో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

అమరచింత: ప్రభుత్వం దళితుల అభ్యున్నతికి తోడ్పాటు అందించడం లేదని, దళిత హక్కుల సాధన కోసం పోరాటం చేయాల్సిన అవసరం ఉందని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మసప్ప, రవీందర్ అన్నారు. మండల కేంద్రంలో అమరచింత పట్టణ నూతన కమిటీని బుధవారం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దళితులు ఆర్థిక, రాజకీయ, సామాజిక, హక్కుల పరిరక్షణ, కుల వివక్షను వ్యతిరేకిస్తూ కలిసి కట్టుగా ఉద్యమాలు చేయడానికి ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం కమిటీ పట్టణ అధ్యక్షుడిగా రాంచందర్, ఉపాధ్యక్షులుగా రాజేష్, దాసు, కార్యదర్శిగా దిన కుమార్, సహకార్యదర్శిగా ఇజ్రాయిల్, కోశాధికారిగా సోలు తో పాటు పది మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.